సాక్షి
విజయనగరం

మంగళవారం । 28 । మార్చి । 2023



వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యం
ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యం కల్పిస్తోందని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. - 8లో



అర్జీల్లో రెవెన్యూ సమస్యలే అధికం
కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి 163 అర్జీలు అందాయి. - 8లో

నేడు పోలమాంబ ఆఖరు జాతర


ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆఖరు (10వ) జాతర మంగళవారం జరగనుంది. భక్తుల దర్శనానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. -8లో

ఇఫ్తార్ | సహర్
మంగళ (సా॥) | బుధ (ఉ॥)
6:15 | 4:32

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

వైద్యాధికారి పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు
విజయనగరం ఫోర్ట్: పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎన్‌బీఎస్‌యూ, ఎన్‌ఆర్‌సీ, టెలీ మెడిసిన్ హబ్‌లలో ఖాళీగా ఉన్న ఏడు వైద్యాధికారి పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఏప్రిల్ ఒకటో తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి. రమణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10.30 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు, జెరాక్సు పత్రాలపై గెజిటెడ్ సంతకం చేయించి తీసుకురావాలన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిలల్ పేరు నమోదై ఉండాలన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఈ నెల 1 నుంచి 27వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీల ఆదాయం రూ. 2,04,371లు లభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరుకుమార్, సభ్యులు వంకల కృష్ణ, రేగిడి అప్పలనాయుడు, దేవదాయశాఖ సీనియర్ సహాయకుడు జి.శ్యామ్‌ప్రసాద్, ఆలయ ఈఓ జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస రైల్వే స్టేషన్ పరిశీలన


రైల్వే స్టేషన్‌ను సందర్శించిన రైల్వే పీఏసీ కమిటీ సభ్యులు

కొత్తవలస: అమృత భారత్‌లో భాగంగా కొత్తవలస రైల్వే స్టేషన్‌ను రైల్వేబోర్డు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సభ్యులు దిలీప్‌కుమార్‌మాలిక్, అభిజిత్ దాస్, జి.వి.మంజునాథ్, ఉమారాణి, పరుసురామ్ తదితరులు సోమవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అభివృద్ధి చేయాల్సిన పనులను గుర్తించారు. కరోనా ముందు వరకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, విజయవాడ–రాయగాడ పాసింజర్ రైళ్లకు స్టేషన్‌లో హాల్ట్ సదుపాయం ఉండేదని, మళ్లీ పునరుద్ధరించాలని పీఏసీ సభ్యులకు స్థానిక బీజేపీ నాయకులు అప్పారావు, సత్యసాయి బాబు తదితరులు వినతిపత్రం అందజేశారు.

11 మంది డీబార్
విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (ఫిజిక్స్ పేపర్–2, ఎకనామిక్స్ పేపర్–2) పరీక్షకు విజయనగరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24,398 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులు 20,957కు 20,124 మంది, ఒకేషనల్ పరీక్షకు 4,579 మందికి 4,274 మంది హాజరయ్యారు. 1138 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ నాలుగు పరీక్ష కేంద్రాలను, డీఈసీ మూడు కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 42, ఇతర అధికారులు 8 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 11 మందిని డీబార్ చేసినట్టు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు.

ఫిజిక్స్ సబ్జెక్టులో 2 మార్కుల కేటాయింపు
ఇంటర్మీడియట్ సెకెండియర్ ఫిజిక్స్–2 (ఇంగ్లిష్ మీడియం) పేపర్‌లో మూడో ప్రశ్న (రెండు మార్కు లు) తప్పుగా పడింది. ఆ ప్రశ్నకు సమాధానం రాసినా, రాయకపోయినా మార్కులు కేటాయిస్తామని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించినట్టు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులందరూ గమనించాలని కోరారు.

సర్కారు బడి.. డిజిటల్ ఒరవడి!



- ట్యాబ్‌ల ఆధారంగా బోధన
- బైజూస్ పాఠాలతో విద్యాబోధనలో నవశకం
- తొలి విడతలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 27,892 మంది విద్యార్థులకు ప్రయోజనం
- డిజిటల్ బోధనలో 3,477 మంది ఉపాధ్యాయులు



ట్యాబ్‌లలో కంటెంట్‌ను అవగాహన చేసుకుంటున్న విద్యార్థులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

నాడు: పాఠ్యపుస్తకాల ఆధారంగా తరగతిలో బోధన జరిగేది. టీచర్ చెప్పిన పాఠం మళ్లీ మళ్లీ వినాలంటే కష్టమయ్యేది. అర్థంగాకపోతే మళ్లీ టీచర్‌ను అడిగి నివృత్తి చేసుకోవాల్సిందే. ఎవరైనా వెనుకబడితే పరీక్షల్లో ఇబ్బంది అయ్యేది.

నేడు: పాఠ్యాంశాలన్నీ ట్యాబ్‌లోకి వచ్చేశాయి. ప్రతి పాఠానికి టీచర్ ఆడియో, వీడియో రెండూ ఉంటాయి. ఆ బోధనల్లో ఏ మాత్రం సందేహం ఉన్నా ఇంటికెళ్లిన తర్వాత కూడా ఎన్నిసార్లైనా వినవచ్చు. ప్రతి పాఠ్యాంశానికి అనుబంధంగా పోటీ పరీక్షలకు అవసరమైన ప్రశ్నావళి ఉంటుంది. అలా తర్ఫీదు ద్వారా ప్రజ్ఞ పెంచుకోవడానికి బృహత్తరమైన అవకాశం వచ్చింది. మరేవిధంగానూ ఇంటర్‌నెట్ లింక్ చేయడానికి కుదరదు. ఒకవేళ ఏ విద్యార్థి అయినా లింక్ చేస్తే ట్యాబ్‌లోని పాఠ్యాంశాలన్నీ బ్లాక్ అయిపోతాయి. అంతేకాదు ప్రతి ఐదుగురు విద్యార్థుల ట్యాబ్‌లపై పర్యవేక్షణ బాధ్యతలను ఒక్కో టీచర్‌కు అప్పగించారు. దీనివల్ల ఎక్కడా దుర్వినియోగానికి ఆస్కారమే లేదు.

భుజానికి బ్యాగ్... చేతిలో ట్యాబ్... చూడచక్కని యూనిఫాం.. కాళ్లకు బూట్లు... ఆ విద్యార్థులను చూస్తుంటే వారిది ఏ ఇంటర్నేషనల్ స్కూలో, ఏ కార్పొరేట్ స్కూలో అనుకుంటే పొరపాటే! వారంతా మన సర్కారీ బడుల విద్యార్థులే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 'మన బడి నాడు–నేడు' కార్యక్రమంతో ఆ బడుల దశ దిశా మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఎదిగేలా ఇప్పుడు ఆయన అందించిన ట్యాబ్‌లు విద్యార్థులకెంతో ప్రయోజనం చేకూర్చుతున్నాయి. బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లతో డిజిటల్ బోధనతో నవశకానికి నాంది పలికారు.

ట్యాబ్‌ల పంపిణీ ఇలా..
తొలివిడతలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను గత ఏడాది డిసెంబర్ 21 తేదీ నుంచి అందించింది. విజయనగరం జిల్లాలోని 457, పార్వతీపురం మన్యం జిల్లాలోని 263 పాఠశాలల్లో 27,892 మంది విద్యార్థులకు ఒక్కొక్కటి చొప్పున అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ విద్యారంగ దిగ్గజం బైజూస్‌తో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఆ ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్ ఇంగ్లిష్, తెలుగులో నిక్షిప్తమైంది. బైజూస్ కంటెంట్‌ను నిక్షిప్తం చేయడానికైన ఖర్చుతో కలిపితే ఒక్కొక్కటీ సుమారు రూ.32 వేల విలువైన ట్యాబ్‌లను విద్యార్థులతో పాటు వారికి బోధించే టీచర్లకు కలిపి మొత్తం 31,369 ట్యాబ్‌లను ప్రభుత్వం ఉచితంగా అందించింది. అలా చూస్తే ఈ రెండు జిల్లాలకే రూ.వంద కోట్లకు పైగా ఖర్చు అయ్యింది.

తొలి విడత ట్యాబ్‌లు అందిందిలా...

నియోజకవర్గం	విద్యార్థులు	ఉపాధ్యాయులు
బొబ్బిలి	2,532	335
చీపురుపల్లి	2,621	390
గజపతినగరం	2,371	370
నెల్లిమర్ల	3,358	448
రాజాం	2,650	340
సాలూరు	2,747	263
శృంగవరపుకోట	2,114	271
విజయనగరం	1,979	235
పాలకొండ	2,592	281
పార్వతీపురం	1,849	249
కురుపాం	3,079	295
మొత్తం	27,892	3,477

పాఠ్యాంశాల కంటెంట్ ప్రీలోడ్...
విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ట్యాబ్‌ల్లో కంటెంట్ ప్రీలోడ్ చేశారు. 8, 9 తరగతులకు సంబంధించిన గణితం, భౌతిక, జీవ, రసాయనశాస్త్రాలు, చరిత్ర, భూగర్భశాస్త్రం, పౌరశాస్త్రం సబ్జెక్టుల పాఠాలు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ఉన్నాయి. పాఠ్యపుస్తకాల్లోని అధ్యాయాల వారీగా పొందుపరిచారు. ప్రతి అధ్యాయం కాన్సెప్ట్‌లుగా విభజించారు. ప్రతి కాన్సెప్ట్‌ను రెండు నుంచి నాలుగు నిమిషాల వ్యవధితో వీడియోలుగా రూపొందించారు. ఇలా మొత్తం 300 వీడియోలతోపాటు 57 అధ్యాయాలు, 472 కాన్సెప్ట్‌లు ఉన్నాయి.

ప్రశ్నపత్రాలపై సులభంగా తర్ఫీదు...
ట్యాబ్‌లలో సబ్జెక్టుల వారీగా 168 ప్రశ్నపత్రాలు ఉన్నాయి. విద్యార్థులు పాఠ్యాంశాలను వీడియోలో చూసి నేర్చుకోవడంతో పాటు ప్రశ్నపత్రాలనూ ప్రాక్టీస్ చేసుకొనే వెసులుబాటు ఉంది. తద్వారా అభ్యసనా సామర్థ్యాన్ని ఎవరికి వారే పెంపొందించుకోవడానికి దోహదపడుతోంది. తమ సందేహాలను ఎప్పుడైనా, ఎక్కడైనా నివృత్తి చేసుకోవచ్చు. దీంతో తరగతిలో వెనుకబడిన విద్యార్థులు సైతం చదువులో ఇప్పుడు రాణిస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

జగన్ మామయ్య మంచి గిఫ్ట్


ముఖ్యమంత్రి జగన్ మామయ్య మా చదువుకు ఉపయోగపడే మంచి గిఫ్ట్‌గా ట్యాబ్ ఇచ్చారు. మాలాంటి పేద విద్యార్థుల భవిష్యత్‌కు ఇదెంతో ఉపయోగపడుతుంది.
– కోరాడ కీర్తన, గొట్లాం జెడ్పీ హైస్కూల్

ట్యాబ్ ఎంతో ఉపయోగపడుతోంది


ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్ నా చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది. సైన్స్, మ్యాథ్స్ నోట్స్ రాసుకోవడానికి బొమ్మలతో అర్థమయ్యేలా కంటెంట్ ఉంది. మ్యాథ్స్ ఫార్ములాలు సులభంగా అర్థం చేసుకుంటున్నాం.
– తాడ్డి వాసవి, రామతీర్థం హైస్కూల్

సద్వినియోగం చేసుకుంటున్నా..


ట్యాబ్ సద్వినియోగం చేసుకుంటున్నా. బైజూస్ యాప్ వల్ల తరగతి గదిలో పాఠాలు విన్న తర్వాత వీడియో చూడటం వల్ల బాగా అర్థం చేసుకోగలుగుతున్నాం. డిక్షనరీ యాప్ కూడా ఉపయోగపడుతోంది.
– కె.శ్రీధారిణి, ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, వేపాడ

ట్యాబ్‌ల పంపిణీ శుభ పరిణామం


ఉన్నత విద్యకు చక్కని పునాదివేసే విధంగా బేసిక్స్ నుంచి కంటెంట్ ట్యాబ్‌ల్లో ఉంది. ఈ విధానం ఉన్న ట్యాబ్‌లను విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేయడం శుభపరిణామం. పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలనైనా ఎదుర్కోగలరు. మంచి స్పందన వస్తోంది. పూర్తిస్థాయిలో ఫలితాలు రావడానికి కాస్త సమయం పడుతుంది.
– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం జిల్లా

మంచి ఫలితాలు సాధించవచ్చు


పాఠ్యాంశాల కంటెంట్ వీడియోలు యానిమేటెడ్ కావడం వల్ల విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకొంటున్నారు. ఉపాధ్యాయులకు బోధన సులభతరమైంది. తరగతి గదిలో చెప్పిన పాఠాలను ట్యాబ్‌ల ద్వారా పునఃశ్చరణ చేసుకునే అవకాశం విద్యార్థులకు లభించింది. ఇలా మంచి ఫలితాలు సాధించవచ్చు.
– అల్లు వెంటకరమణ, ప్రధానోపాధ్యాయుడు, మలిచర్ల జెడ్పీ హైస్కూల్



బొండపల్లి హైస్కూల్‌లోని ఉపాధ్యాయుల చేతిలో ట్యాబ్‌లు

ట్యూషన్లు అవసరం లేదిక...


ట్యాబ్ వల్ల ట్యూషన్ల అవసరం లేదు. ఇంటి వద్దనే ట్యాబ్‌లో బైజూస్ యాప్ ద్వారా నేను వెనుకబడి ఉన్న పాఠ్యాంశాలను, సబ్జెక్టులను సులభంగా నేర్చుకోగలుగుతున్నాను.జగన్ మామయ్యకు కృతజ్ఞతలు.
– కెల్ల దుర్గాప్రణతి, గుర్ల జెడ్పీ హైస్కూల్

ట్యాబ్‌తో నో డౌట్స్...


బైజూస్ యాప్ ద్వారా తరగతులు వినడానికి, సందేహాలు నివృత్తి చేసుకోవడానికి ట్యాబ్‌లు మాకు నిరంతరం సహాయపడుతున్నాయి. నో డౌట్స్. నేర్చుకున్నవారికి నేర్చుకున్నంత. మా ఉపాధ్యాయుల సూచనలతో వాటి వాడకంలో మెరుగుపడ్డాం.
– కె.హారిక, నారాయణప్పవలస హైస్కూల్

విశాఖరేంజ్ డీఐజీ వార్షిక తనిఖీ
విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సోమవారం సాయంత్రం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఎం.దీపిక ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు గౌరవవందనం చేశారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే అధికారులు, వారు నిర్వహించే వివిధ రికార్డులు, పనితీరు, ఉన్నత పోలీస్ కార్యాలయాలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలించారు. జిల్లా నేర రికార్డ్స్, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్ట్‌సెల్ అధికారులు, సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్పీ ఆధ్వర్యంలో సాగుతున్న పోలీస్ సంక్షేమ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీఓ ఏఓ వెంకటరమణ, సీఐలు, అధికారులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ

అమ్మో.. దెయ్యంచేప


రాజాం: మత్స్యకారులను దెయ్యం చేపలు భయపెడుతున్నాయి. వలలకు చిక్కుకుని ఇబ్బంది పెడుతున్నాయి. బుచ్చింపేట గ్రామం వద్ద కొండోడు చెరువులో సోమవారం వేటసాగించిన డొక్కరగణ అనే వ్యక్తి వలలో దెయ్యం బేరుగా పిలిచే చేప పడింది. మొప్పలు వద్ద ముళ్లు, ఒళ్లంత చిన్న మచ్చలతో ఉన్న ఈ చేపలు ఎక్కువుగా బురదలో లోతైన ప్రాంతాల్లో ఉంటాయని రాజాంకు చెందిన మత్స్యకార సంఘ నాయకుడు శంకర్ తెలిపారు. వీటి నోరు, దవడ దిగువన చర్మం భయంకరంగా ఉంటుందని, చిన్న చిన్న చేపలను ఇవి తినేస్తాయన్నారు. వీటిని బల్లి చేప, అమెజాన్ స్ప్రైలీన్, క్యాట్ ఫిష్‌గా పిలుస్తారని తెలిపారు. మనుషులు ఎవరూ తినరన్నారు.

ఆ బిల్లుతో వైద్యులకు ఇబ్బంది
- రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై పునరాలోచించాలి
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు



మాట్లాడుతున్న డాక్టర్ జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు ఆరోగ్యహక్కు కల్పన పేరిట రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'రైట్ టు హెల్త్ బిల్లు' వైద్యులకు ఇబ్బందికరంగా ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ముర్రు జయచంద్రనాయుడు పేర్కొన్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైట్ టు హెల్త్ బిల్లు వైద్యుల హక్కులను హరించేలా ఉందన్నారు. సమాజం వైద్యులను గౌరవిస్తేనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఉత్సాహంచూపుతారన్నారు. బిల్లుకు నిరసనగా దేశవ్యాప్తంగా బ్లాక్ డే ప్రకటించామని తెలిపారు. ప్రస్తుతం బిల్లు గవర్నర్ దగ్గర ఉందని, రాజస్థాన్ ప్రభుత్వం వెంటనే బిల్లును వెనుకకు తీసుకోవాలని కోరారు. డాక్టర్ డీవీజీ శంకరరావు మాట్లాడుతూ రైట్ టు హెల్త్ బిల్లు ఆరోగ్యరంగానికి వ్యతిరేకంగా ఉందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన వైద్యులపై లాఠీచార్జీ చేయించడం తగదన్నారు. వైద్యులకు ప్రజల మద్దతు కావాలని కోరారు. సమావేశంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మధుకర్, జిల్లా కార్యదర్శి డాక్టర్ మహేంద్రగిరి, డాక్టర్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంతవరకు ప్రజలతోనే..
- తండ్రి సాంబశివరాజు ఆశయ సాధనే లక్ష్యం
- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు



తండ్రి సాంబశివరాజు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, తండ్రి పెనుమత్స సాంబశివరాజు వలే ఊపిరి ఉన్నంతవరకు ప్రజాసమస్యల పరిష్కారానికి, వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం స్వగ్రామమైన మొయిద గ్రామానికి సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ముందుగా సాంబశివ రాజు సమాధి వద్దకు చేరుకొని నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండ్రి సాంబశివరాజు నీతి, నిజాయితీతో రాజకీయాలు చేశారన్నారు. ఆయన బతికున్నంత కాలం దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి వెంటే నడిచారని.. ఆయన మరణాంతరం జగన్‌మోహన్‌రెడ్డి బాటలో పయనించారని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా పర్యటించి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పని గొప్ప నాయకుడని, ఆయన చలువతోనే రెండోసారి ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు చేపట్టానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఆయన సారథ్యంలోని ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తండ్రి వలే జీవితాంతం ప్రజాక్షేత్రంలో సాగుతానన్నారు. శాసన మండలి సభ్యుడిగా ఓటు వేసి గెలిపించిన 22 మంది ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకువెళతానని అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మెన్ సముద్రపు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- డీఎల్‌పీఓ మోహనరావు
- రూ.40.20 లక్షలకు ఖరారైన రామభద్రపురం మార్కెట్ ఆశీల వేలంపాట



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ మోహనరావు

రామభద్రపురం: గ్రామ పంచాయతీల ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని డీఎల్‌పీఓ ఎ.మోహనరావు తెలిపారు. రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో ఏడాది పొడవునా ఆశీలు వసూలు వేలంపాటను సర్పంచ్ రవ్వా ఈశ్వరరావుతో కలిసి సోమవారం నిర్వహించారు. వేలంపాటకు గొర్లి అప్పారావు, తూముల గోపాలకృష్ణ దరఖాస్తు చేసుకోగా, రూ.40.20 లక్షలకు తూముల గోపాలకృష్ణ వేలంపాటను సొంతం చేసుకున్నారు. గతేడాది కంటే రూ.3.17లక్షలకు అదనంగా వేలంపాట ఖరారైంది. అనంతరం డీఎల్‌పీఓ మాట్లాడుతూ విజయనగరం డివిజన్‌లోని పది పంచాయతీల పరిధిలో సాగే రోజువారీ మార్కెట్లలో ఆశీల వసూలకు వేలంపాట నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చిన డబ్బులను పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ, ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఈఓ సుప్రియ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
విజయనగరం లీగల్: జిల్లా కేంద్ర న్యాయవాద సంఘ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు 5 నామినేషన్లు దాఖలయ్యాయి. కోశాధికారి పదవికి కోన అప్పారావునాయుడు, సంయుక్త కార్యదర్శి పదవికి సారిక సతీష్, సీనియర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ల పదవికి ఎస్.భవానీ, ఎస్.హరిమోహన్, గుణాన రాంబాబు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 31న ఓటింగ్ ప్రక్రియతో పాటు అదేరోజు ఫలితాలను వెల్లడిస్తామని ఎన్నికల అధికారులు పెంట శ్రీరామ్మూర్తి, రెడ్డి రామకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు

బొబ్బిలి: పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈనెల 28 నుంచి ఐదురోజుల పాటు రాజస్థాన్‌లో జరిగే ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో జి చరిత, బి.యశస్విని, క్యాడెట్ విభాగంలో జి జాహ్నవి పాల్గొంటారని చెప్పారు.

ఇసుక లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

దత్తిరాజేరు: మండలంలోని గడసాం సమీపంలో సోమవారం తెల్లవారు జామున బీటి రోడ్డుపై అదుపు తప్పి ఇసుక లారీ బోల్తా పడినట్లు పెదమానాపురం ఎస్సై బి.భాగ్యం తెలిపారు. ఒడిశా నుంచి అన్ని అనుమతులతో వైజాగ్ వెళ్తున్న లారీ వర్షానికి అదుపు తప్పినట్లు చెప్పారు. అయితే అదృష్టవశాత్తు డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయట పడ్డారన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



లారీ ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని పోలీస్‌స్టేషన్ దారిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత పెనుప్రమాదం తప్పింది. ఇసుకతో వెళ్తున్న లారీ ఒక్కసారిగా అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం పూర్తిగా విరిగిపోయింది. అదే సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఏఎస్సై రమణమ్మ ఘటనపై అప్రమత్తమై లారీ డ్రైవర్, క్లీనర్‌లను పరిశీలించి చిన్నగాయాలతో ఉన్న వారిని సామాజిక ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది పవర్ సప్లై నిలిపివేశారు. సోమవారం కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

డస్ట్‌బిన్ పెట్టమన్నందుకు దాడి



చికిత్స పొందుతున్న వెంకటరమణ



గౌరీశంకరరావు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణం బంధంవారి వీధిలో ఆయుర్వేదిక్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఎస్.వెంకటరమణను, పక్కన నున్న స్వీట్‌షాపు యజమాని గౌరీశంకరరావు రాయితో కొట్టి గాయపరిచాడు. వివరాలిలా ఉన్నాయి. స్వీట్ షాప్‌కు వచ్చిన వారు స్వీట్లు తినేసి ఆ చెత్తను తన షాపుముందు పడేస్తున్నారని, దీనివల్ల వ్యాపారానికి ఇబ్బందిగా ఉందని గౌరీశంకరరావును వెంకటరమణ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి వెంకటరమణను రాయితో తలపై బలంగా గౌరీశంకరరావు కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గనించిన స్థానికులు బలరాం, సత్తిబాబులు క్షతగాత్రుడిని ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. అలాగే ఈఘటనలో గౌరీశంకరరావుకు కూడా కంటి పైభాగంలో దెబ్బతగలడంతో ఆయన కూడా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యం

- రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యన్నారాయణ
- 104 వాహనాల ప్రారంభం



104 వాహనాలను ప్రారంభిస్తున్న విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యం కల్పిస్తోందని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు జిల్లాకు కేటాయించిన పందొమ్మిది 104 వాహనాలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుతో కలిసి గరివిడిలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సంపూర్ణంగా ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ వాహనాలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజల చెంతకు వైద్య సేవలు అందించడం కోసం ఈ 104 వాహనాలను ప్రారంభించామని చెప్పారు. దివంగతనేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి ఈ వాహనాలతో ప్రజలకు మంచి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. జిల్లాలో ఇది వరకే 104 వాహనాలు ఉన్నప్పటికీ మరింత మెరుగైన వైద్యసేవలను అందించడం కోసం కొత్త వాహనాలను ఏర్పాటు చేశామన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ఈ వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అనునిత్యం పేద ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలనే ఆలోచనతోనే పేదల పక్షాన నిలబడుతోందన్నారు. అందులో భాగంగానే ప్రతి సచివాలయం పరిధిలో స్థానికంగా గ్రామాల్లోనే వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో వెల్‌నెస్ సెంటర్‌లను కూడా మంజూరు చేశామన్నారు. ఈ భవన నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వస్తే ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంతో వైద్యసేవలు అందిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎస్వీ.రమణకుమారి, చీపురుపల్లి,గరివిడి ఎంపీపీలు ఇప్పిలి వెంకటనరసమ్మ, మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.ప్రమీల, వైఎస్సార్‌సీపీ గరివిడి మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, బమ్మిడి అప్పలస్వామి, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు, మెరకముడిదాం మండల నాయకులు తాడ్డివేణు, కోట్ల వెంకటరావు, అన్ని గ్రామాలకు చెందిన సర్పంచులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పారదర్శకంగా అంగన్‌వాడీల నియామకం

- 78 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



తోటపాలెంలో పిల్లలకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ పోస్టుల భర్తీని ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తోంది. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం పోస్టులను భర్తీ చేస్తోంది, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి ఒకసారి నియమకాలు చేపట్టేవారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టులు ఖాళీగా ఉండకూడదనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పడిన ఖాళీల లను మూడు నెలలకు ఒకసారి భర్తీ చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా సకాలంలో పోస్టులు భర్తీ అవుతున్నాయి.

జనవరిలో 120 పోస్టుల భర్తీ

ఈఏడాది జనవరి నెలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా, మిని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 120కి నోటిఫికేషన్ ఇచ్చారు. వాటికి ఇంటర్వ్యూలు నిర్వహించి భర్తీ కూడా పూర్తి చేశారు. తాజాగా మరో 78 పోస్టులకు సోమవారం నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో 10 అంగన్‌వాడీ, 53ఆయా, 15 మినీ అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.11,500, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాకు రూ.7 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు 10 వతరగతి పాసై సంబంధిత గ్రామ వివాహిత అయి ఉండాలి. 1-7-2022 నాటికి 21నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

గడువులోగా దరఖాస్తు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ పారదర్శకంగా జరుగుతోంది. 78 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాం. గడువులోగా భర్తీ చేస్తాం. గడవులోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.
– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సాధికారత అధికారిణి

జిల్లాలో 14 ప్రాజెక్టులు	
ప్రాజెక్టుల వారీగా భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు	
ప్రాజెక్టు పేరు	పోస్టుల సంఖ్య
బాడంగి	6
బొబ్బిలి అర్బన్	1
గజపతినగరం	6
బొబ్బిలి రూరల్	4
సాలూరు రూరల్	1
చీపురుపల్లి	11
నెల్లిమర్ల	6
రాజాం	4
వీరఘట్టం	10
ఎస్.కోట	4
వియ్యంపేట	1
గంట్యాడ	6
భోగాపురం	12
విజయనగరం అర్బన్	4

చోరీకి పాల్పడిన నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: బట్టల షాపులో చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బట్టలు, నగదు రికవరీ చేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం స్థానిక కార్యాలయంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాలాజీ మార్కెట్‌లో షాప్ నంబర్ 304 యజమాని అరుణ్‌కుమార్ అగర్వాల్ ఈ నెల 23న రాత్రి షాపు మూసేసి ఇంటికి వెళ్లిపోయారు. ఎవరో గుర్తు తెలియని దొంగలు మారుతాళంతో షాప్ షట్టర్ తీసి, లోపలికి ప్రవేశించి దఫదఫాలుగా సుమారు రూ.లక్షా 90వేలు విలువైన బట్టల మూటలు దొంగిలించి పారిపోయినట్లు గుర్తించిన యజమాని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన బొండపల్లి మండలం జియ్యన్నవలసకు చెందిన చుక్క, పడాల శంకర్, ఎర్రశ్రీను, పట్నాన అప్పలనాయుడులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 75వేల నగదు, పది బట్టల మూటలను రికవరీ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదించడంలో క్రియాశీలకపాత్ర పోషించిన ఎస్సైలు అశోక్ కుమార్, భాస్కరరావు, హెచ్‌సీ అచ్చిరాజు, సిబ్బందిని సీఐ అభినందించారు.

నేడు పోలమాంబ ఆఖరు జాతర



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆఖరు జాతర(పదో జాతర) మంగళవారం జరగనుంది. ఆఖరు జాతర కావడంతో భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశమున్నందున ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే చదురుగుడి ఆలయం వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వేపాడ: అప్పలనాయుడు మృతదేహం

వేపాడ: మండలంలోని భర్తవానిపాలెం గ్రామానికి చెందిన పిల్లా అప్పలనాయుడు (48) విశాఖలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అప్పలనాయుడు ప్రస్తుతం విశాఖలో ఉంటున్నాడు. కొత్తఅమావాస్య సందర్భంగా మంగళవారం స్వస్థలానికి వచ్చి తిరిగి గ్రామం నుంచి మరో వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకుని వెళ్తుండగా బల్లంకి వెళ్లే మలువువద్ద బైక్ ప్రమాదానికి గురైంది. దీంతో బైక్ నడుపుతున్న అప్పలనాయుడు తలకు గాయం కాగా విశాఖ తరలించి ఆపరేషన్ చేయించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు వల్లంపూడి ఏఎస్సై గోపీకృష్ణ చెప్పారు.

పిడుగుపాటుతో ఒకరు...



జియ్యమ్మవలస: సింహాచలం మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి వన్నెల సింహాచలం (60) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిలాగానే పశువులను నాగావళి నది ఒడ్డుకు మేతకు తీసుకువెళ్లి సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు బాబు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారందరికీ వివాహాలు అయ్యాయి.

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి..



గజపతినగరం: మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గజపతినగరం: గజపతినగరం రైల్వే స్టేషన్ యార్డులో రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి (27)మృతి చెందాడు. సోమవారం తెల్లవారు జామున 3గంటలకు జరిగిన ఈ సంఘటనపై రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తి దివ్యాంగుడని, రైలు నుంచి జారి పడి ఉండవచ్చన్నారు. మృతుడి ఎడమ చేతిపైన దివ్య అనే పేరుతో పచ్చబొట్టు ఉందని అదే చేతి పైన ఇంగ్లీష్ అక్షరాలు పచ్చబొట్టుతో విడివిడిగా ఉన్నాయని చెప్పారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు ఫోన్ 9666555214,9441013330 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అర్జీల్లో రెవెన్యూ సమస్యలే అధికం



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 163 అర్జీలు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 123 అర్జీలు అందాయి. హౌసింగ్‌కు సంబంధించి 10, మున్సిపల్ శాఖ 7, వైద్యశాఖ 6, సచివాలయాలకు సంబంధించి 11 అందగా మిగిలినవి పింఛన్లు, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు తదితర సమస్యలపై వినతులు అందాయి. స్పందన కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు సూర్యనారాయణ, సుదర్శనదొర పాల్గొని వినతులు స్వీకరించారు.

కనీస వేతనం అమలు చేయాలి

ఆర్టీసీలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి, అద్దెబస్సుల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఆ సిబ్బంది సంఘం డిమాండ్ చేసింది. సంఘం జిల్లా కమిటీ, సీఐటీయూ సంయుక్తంగా స్థానిక కలెక్టరేట్ ఎదుట ఈ మేరకు సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని జేసీ మయూర్ అశోక్‌కు అందజేశారు.

దూరవిద్య కేంద్రాన్ని ఎంఆర్ కళాశాలలో కొనసాగించాలి

పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాలలోనే ఆంధ్రయూనివర్సిటీ దూర విద్యా కేంద్రాన్ని కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు.

స్పందన పిర్యాదులపై తక్షణ చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందనలో ప్రజల నుంచి అందుకున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో భాగంగా ప్రజల నుంచి ఆమె 26 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషిచేయాలని, తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని ఆదేశాలు జారీచేశామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి, ఆర్ఎస్సై నీలిమ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ ఆనంద్



వినతులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయనతో పాటు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, డీఆర్‌డీఏ ఏపీడీ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుంచి 110 అర్జీలను స్వీకరించారు.

అర్జీల వివరాలు ఇలా..

గ్రామానికి రోడ్డు సౌకర్యం లేనందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని జియ్యమ్మవలస మండలం అర్నాడవలస గ్రామానికి చెందిన ఎం.సురేష్ కోరారు.

- పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామంలో లంకెల చెరువు మీద ఆధారపడి కొన్ని సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నామని, లంకెల చెరువును ఆక్రమణ దారుల నుంచి కాపాడి ఆయుకట్టుదారులకు నీటి సదుపాయం కల్పించాలని జె.ప్రసాద్, తదితర రైతులు దరఖాస్తు అందజేశారు.

రెండు సంవత్సరాలుగా తన కుమార్తెకు అమ్మఒడి అందడం లేదని కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన జి.గంగ వినతి పత్రం సమర్పించింది.

జియ్యమ్మవలస మండలం దంగభద్ర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ఇచ్చే పాలు, గుడ్లు సక్రమంగా ఇవ్వడం లేదని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్.ఉపేంద్ర వినతిపత్రం అందజేశాడు.

కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా పీఆర్ ఈఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ. ప్రభాకర రావు, డ్వామా పీడీ కె. రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపడుతున్నామని జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన చట్ట పరిధిలో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ హరితచంద్ర, ఎస్బీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, ఎస్సై దినకర్ పాల్గొన్నారు.

బొడ్డవలస పాఠశాల సంఘటనపై విచారణ



చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా సమన్వయకర్త చంద్రావతి

సాలూరు: మండలంలోని పీఎన్ బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన విద్యార్థుల మధ్య గలాటాపై రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా సమన్వయకర్త చంద్రావతి సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాలకు వచ్చిన ఆమె విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం బొడ్డమాను గ్రామానికి చెందిన కె. జనార్దన్, వి.అఖిల్, పి.రాములు ద్విచక్రవాహనంపై రాయగడ నుంచి జంఝావతి జంక్షన్ మీదుగా బొడ్డమాను గ్రామం వస్తుండగా రాజ్యలక్ష్మీపురం, కోనవలస గ్రామాల మధ్య మలుపులో ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

చెట్టుపై నుంచి జారి పడి మహిళకు..



చికిత్స పొందుతున్న లక్ష్మి

కొమరాడ మండలం సుంకేసు గ్రామంలో ఆదివారం సాయంత్రం జీడిపిక్కలు ఏరేందుకు వెళ్లిన ఎం.లక్ష్మి ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి గాయాల పాలైంది. వెంటనే కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి ఆటోలో తరలించగా చికిత్స పొందుతోంది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	56,150–00
బంగారం(22క్యా. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹ 216